RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 79 | పేజీలు : 4 | ఆదివారం 20 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



పశ్చిమాసియాలో టెన్షన్..

తమ పౌరులకు అమెరికా కీలక హెచ్చరిక

సౌదీపై హౌతీ తిరుగుబాటుదారుల దాడుల నేపథ్యంలో కీలక హెచ్చరిక

పశ్చిమాసియా ప్రయాణాలపై అమెరికా తన పౌరులకు కొత్త అడ్వైజరీ జారీ

పరిస్థితి ఏ క్షణమైనా తీవ్రరూపం దాల్చవచ్చని ఆందోళన వ్యక్తం చేసిన యూఎస్



ఎల్ నినో ప్రభావాన్ని ముందే అంచనా వేసుకున్నాం..

ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి

ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ కార్యాచరణపై సీఎం చంద్రబాబు సమీక్ష

రైతులను ఆదుకోవడం, నిత్యావసరాల ధరల నియంత్రణే ప్రధాన లక్ష్యం

బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలు అదుపులో ఉంచాలని ఆదేశం

డిమాండ్‌కు తగిన పంటల సాగు, వర్షాధార వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచన

విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం



అమరావతి

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఆర్ఎస్కే సిబ్బందితో ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎల్ నినో వంటి విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడం, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరగకుండా నియంత్రించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విపత్తును ఒక సవాలుగా స్వీకరించి, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి - మిగతా 3లో




సత్యప్రసాద్ వాంగ్మూలంపై జగన్ ఎందుకు స్పందించడంలేదు?

- గత వైసీపీ ప్రభుత్వ మద్యం విధానంపై మంత్రి పార్థసారథి తీవ్ర ఆరోపణలు
- రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంపై జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్
- కీలక అధికారి సత్యప్రసాద్ వాంగ్మూలంతో కుంభకోణం గుట్టు రట్టయిందని వెల్లడి
- డిజిటల్ చెల్లింపులు రద్దు చేసి నగదు లావాదేవీలతో భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపణ

ఎర్రవల్లిలో భూముల

సర్వేకు బ్రేక్



100 మంది రైతులకు నోటీసులు

సోమవారం నుంచి దళిత రైతుల వారీగా భూములను సర్వే చేయనున్నట్లు అధికారులు వెల్లడి

విడతల వారీగా మరో 100 మందికి పైగా రైతులకు కూడా నోటీసులు జారీ చేసే అవకాశం

మూడు రోజులుగా హద్దుల గుర్తింపు

హైదరాబాద్

మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో భూముల సర్వే వేగంగా సాగుతోంది. కాగా, ఎర్రవల్లిలోని 325 సర్వే నంబర్‌లో ఉన్న అసైన్డ్ భూముల సర్వేకు ఆదివారం బ్రేక్ పడింది. ఆదివారం సెలవు కావడంతో అధికారులు సర్వే ప్రక్రియను నిలిపివేశారు. సోమవారం నుంచి దళిత రైతుల వారీగా భూములను సర్వే చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇక, ఎర్రవల్లిలో - మిగతా 3లో


ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం



- అవకాశం ఉన్నా కరెంట్ ఇవ్వకుండా లేని కరవును సృష్టిస్తున్నారంటూ హరీశ్ రావు ఫైర్
- 24 గంటల కరెంట్ పోయి 6-7 గంటలకే పరిమితమైందని విమర్శలు
- మూడు పంటల నుంచి రైతుబంధు పెండింగ్‌లో పెట్టారని ఆరోపణ
- పిట్ట బెదిరింపులకు భయపడేది లేదని ప్రభుత్వానికి హెచ్చరిక

దళితుల భూముల్లో అంగుళం కూడా తీసుకోం..

ఆయన మాటలు నమ్మొద్దు



- కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ నేపథ్యంలో దళిత రైతులకు నోటీసులు
- దళితుల భూములపై మంత్రి పొంగులేటి భరోసా
- భూ రికార్డుల పరిశీలన హక్కుల పరిరక్షణకేనని, భూసేకరణ కాదని వివరణ
- కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- దళితులు, గిరిజనుల భూ హక్కులకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ

హైదరాబాద్

రాష్ట్రంలోని దళితుల భూముల్లో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోదని, వారి భూములకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజల ప్రభుత్వ విధానం కాదని ఆయన తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దళితుల భూములకు పూర్తి - మిగతా 3లో

దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె.. ఖాతాదారులకు ఎస్‌బీఐ కీలక సూచన

తెలంగాణకు భారీ వర్ష సూచన..

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలంగాణకు వర్ష సూచన

రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

సోమవారానికి వాయుగుండంగా, మంగళవారానికి తీవ్ర వాయుగుండంగా బలపడనున్న అల్పపీడనం

గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు

సెప్టెంబర్ 24న పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక

ఆదివారం 20 సెప్టెంబర్ 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

పాపం....బావిలో బల్లుకం..!!

.....బావిలో పడిన ఎలుగుబంటి.. అటవీశాఖకు సమాచారం.

.... బొమ్మనహళ్ మండలం నెమకల్ లో ఘటన.

బొమ్మనహళ్ సెప్టెంబర్ 20 సీమవార్త సాయంత్రం



నెమకల్ గ్రామంలో పంపన గౌడకు చెందిన పొలంలోని బావిలో ఎలుగుబంటి పడిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. పొలానికి వెళ్లిన వారు బావిలో ఎలుగుబంటి ఉన్నట్లు గుర్తించి వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని ఎలుగుబంటిని సురక్షితంగా బయటకు తీసేందుకు చర్యలు చేపట్టనున్నారు. బావి చుట్టూ ప్రజలు గుమికూడకుండా అధికారులు చర్యలు తీసుకుని, ఎలుగుబంటిని రక్షించి అటవీ ప్రాంతంలోకి తరలించే ఏర్పాట్లు చేయనున్నారు. ఘటనతో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.



అయోధ్య తరహా శ్రీరామ మందిరం!

ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రాధాన్యత

రూ"40 లక్షలతో అయోధ్య రామ మందిర నిర్మాణానికి భూమి పూజ.

నియోజకవర్గం లో 6 ఆలయాలకు...రూ, 7.28 కోట్లు నిధులు.

టిటిడీ ధ్వారా త్వరలో 16 భజన మందిరాలకు అనుమతులు.

పనులు ప్రారంభించిన మంత్రి సవిత

సోమందేపల్లి సెప్టెంబర్ 20 సీమ వార్త సాయంకాలం.

నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, ధార్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. సోమందేపల్లి మండల కేంద్రంలో మారుతి నగర్ లో టీటీడీ నిధులతో రూ"40 లక్షల వ్యయంతో నిర్మించనున్న అయోధ్య రామ మందిరానికి ఆదివారం మంత్రి సవిత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం సాకారం కావడం దేశ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. అదే స్ఫూర్తితో పెనుకొండ నియోజకవర్గంలోనూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా టీటీడీ నిధులతో నాలుగు మందిరాలు మంజూరయ్యాయని అందులో భాగంగా సోమందేపల్లిలో రూ" 40 లక్షలతో రామ మందిర నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు.10 సెంట్ల స్థలంలో రామ మందిరం నిర్మాణం చేపడుతున్నామని, టీటీడీ ద్వారా రామ మందిర నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా టీటీడీ ద్వారా త్వరలో 16 భజన మందిరాలకు అనుమతులు రానున్నాయని, అనుమతులు వచ్చిన వెంటనే వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని చెప్పారు.నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు మంత్రి వివరించారు. పరిగి వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ"1.08 కోట్లు, వడిగేపల్లి అమ్మవారి గోపురం నిర్మాణానికి రూ"20 లక్షలు, మరువపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి రూ"20 లక్షలు, పెనుకొండ ఐముఖేశ్వర స్వామి దేవాలయానికి రూ"3 కోట్లు, వానవోలు రంగనాథ స్వామి దేవాలయానికి రూ.2 కోట్లు, రాగిమేకలపల్లిఆంజనేయస్వామి ఆలయానికి రూ"80 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సోమందేపల్లి మండల కేంద్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని, త్వరలో రూ"3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామని మంత్రి - మిగతా3లో







వివక్షత శాపమై.....

ఆయా పోస్ట్‌కై దళిత మహిళ "నిరీక్షణ"..!!

వివక్షతకు గురై విధులకు దూరమైన అంగన్వాడి ఆయా.

9 మాసాలుగా మూతపడిన కొత్తూరు అంగన్వాడీ కేంద్రం..

కొత్తూరు గ్రామపంచాయతీలో పేరు మోసిన రాజకీయ నాయకులు ఉన్నా పరిష్కారంకాని "వివక్షత" వివాదం.

ఆయా "నిరీక్షణ"అందరి కాళ్ళు పట్టుకున్నా, కనికరించని అధికారులు, గ్రామ పెద్దలు.

దళిత మహిళ ఆయా "నిరీక్షణ" చేతుల మీదుగా ఆహార పదార్థాలు ముట్టుకోమన్న గ్రామస్తులు







కళ్యాణదుర్గం సెప్టెంబర్ 20 సీమవార్త సాయంకాలం:

దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు గడిచిపోయిన మారుమూల గ్రామాలలో ఇంకా కుల వివక్షత కొనసాగుతూనే ఉంది. దళితుల జీవితాలు వివక్షతకు గురై అగ్రవర్ణాలు ఆధిపత్యంలో నలిగిపో తున్నాయి. ప్రపంచ మేధావి డాక్టర్ బాబా అంబేద్కర్ అంటరానితనం, కుల వివక్షత రూపుమాపాలని అందరికీ సమానంగా జీవించే హక్కు కల్పించేందుకు రచించిన రాజ్యాంగం ప్రభుత్వాలు అమలు చేస్తుంటే ఆచరణలో మాత్రం ఇంకా గ్రామాల్లో అంటరానితనం వివక్షత రాజ్యమేలుతూనే ఉన్నాయనడానికి కళ్యాణదుర్గం మండలం కొత్తూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న దళిత మహిళ ఆయా నిరీక్షణ ఉదంతం అర్థం పడుతోంది. ఆయా నిరీక్షణ అంటరాని కులానికి చెందిందని, ఆమె చేతుల మీదుగా అంగన్వాడీ కేంద్ర పిల్లలకు ఆహార పదార్థాలు వడ్డిస్తే వినలేమని గ్రామంలోని కొందరు అడ్డు చెప్పడంతో 9 మాసాలుగా అంగన్వాడీ కేంద్రం మూతపడింది. అధికారులు రాజకీయ నాయకులు చివరకు జిల్లా ఉన్నతాధికారులకు కాళ్ళ వేళ్ళ పడిన సమస్యను - మిగతా3లో

దేశ అభివృద్ధిలో మోడీ విశ్వగురువు..!!

.....బిజెపిలోకి భారీగా చేరికలు.

60 కుటుంబాలకు కండువాలు కప్పి ఆహ్వానించిన జిల్లా నాయకత్వం.

ముఖ్యఅతిథిగా హాజరైన....బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, జిల్లా ఇన్చార్జి నీలకంఠం.



సోమందేపల్లి సెప్టెంబర్ 20 సీమ వార్త సాయంకాలం.

మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ సభ్యత నమోదు మరియు చేరికల కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించబడింది. స్థానిక శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపం లో ఏర్పాటు చేసిన నా ప్రత్యేక సభలో వివిధ వర్గాలకు చెందిన 60 కుటుంబాలు స్వచ్ఛందంగా బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. బిజెపి యువ నాయకుడు ఎస్ ఆర్ పార్థసారథి రెడ్డి ప్రత్యేక చొరవతో సమర్థవంతమైన నాయకత్వంలో భారీ చేరికల కార్యక్రమం అత్యంత వైభవంగా పూర్తయింది. ఈ కార్యక్రమానికి శ్రీ సత్య సాయి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు జిఎం శేఖర్ జిల్లా ఇన్చార్జి కూనిగిరి నీలకంఠం జిల్లా ప్రధాన కార్యదర్శి తలమర్ల హరికృష్ణ కన్వీనర్ మంజునాథ్ మరియు వేద వ్యాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతనంగా బిజెపిలోకి చేరిన వారికి నాయకులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. నూతన సభ్యులకు పార్టీ సిద్ధాంతాలు ఆశయాలను వివరించి వారందరికీ పూర్తిస్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి - మిగతా3లో

వివక్షత శాపమై..... ఆయా పోస్ట్ కై దళిత మహిళ "నిరీక్షణ"..!!

-మొదటిపేజీ తరువాయి

పరిష్కరించేందుకు ఎవరు సాహసించకపోవడమే అంటరానితనం కుల వివక్షత పెంచి పోషించబడు తోందనడానికి నిదర్శనంగా నిలుస్తోంది. కొత్తూరు గ్రామపంచాయతీ కేంద్రంలో రెండు అంగన్వాడీ కేంద్రాలు నిర్వహించబడుతున్నాయి. అంగన్వాడీ కేంద్రం -1 బీసీ కాలనీలోనూ, అంగన్వాడీ కేంద్రం -2 ఎస్సీ కాలనీ లోను నిర్వహించబడుతున్నాయి. ఐదు సంవత్సరాల క్రితం ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ఆధారంగా బీసీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం ఆయా పోస్ట్ ఎస్సీలకు రిజర్వుడు కావడంతో దళిత మహిళ స్థానికురాలు నిరీక్షణ దరఖాస్తు చేసుకొని ఆయా పోస్టుకు ఎంపికైంది.30 మంది పిల్లలు ఉన్న అంగన్ వాడి కేంద్రం-1లో బీసీ వర్గానికి చెందిన సీతక్క అంగన్వాడీ కార్యకర్తగా,ఆయాగా నిరీక్షణ అంగన్వాడీ కేంద్రాన్ని ఎలాంటి సమస్యలు లేకుండా

నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత బీసీ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ఎస్సీకి రిజర్వు అయిన అంగన్వాడి పోస్ట్ ను రద్దు చేయించి బీసీలకు ఇవ్వాలని కోణంలో రాజకీయ నాయకులు ప్రయత్నించడం కుల వివక్షత వివాదానికి పునాదివేసింది. ప్రమాదానికి గురైన భర్త ఏసన్న సంపాదించలేని స్థితిలో చిన్న కొట్టు పెట్టుకుని ముగ్గురు పిల్లలను భర్తను పోషించుకునేందుకు ఆయా నిరీక్షణ కుటుంబం కుల వివక్షత కారణంగా వీధిన పడింది. ఆయా ఉద్యోగాన్ని తన నుండి దూరం చేసేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని ఆయా నిరీక్షణ వాపోతోంది. తాను దళిత కుటుంబంలో పుట్టడం నేరమా..? అంటూ సమాజాన్ని ప్రశ్నిస్తోంది. కుల వివక్షతతో తనకున్న జీవనోపాధి ఆయా ఉద్యోగాన్ని రద్దు చేయించేందుకు కుట్ర జరుగుతోందని విలపిస్తోంది. బీసీ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్ర పిల్లలను ఎస్సీ కాలనీలో ఉన్న ఎస్సీ అంగన్వాడీ కార్యకర్త ఎస్సి అంగనవాడి ఆయా ఉన్న కేంద్రంలో విలీనం చేయడం



కులవివక్షత కాదా అని కొందరు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. 9 మాసాలుగా అంగన్వాడీ కేంద్రం -1 ఆయా నిరీక్షణ పోరాటం చేస్తూ ఆయా పదవిని రక్షించుకునేందుకు నిరీక్షిస్తోంది. ఐసిడిఎస్ సిడిపిఓ పిడి లతోపాటు ఆర్డీవోకు వినతి పత్రాలు అందజేసిన ఎవరు స్పందించలేదని నిరీక్షణ చెబుతున్నారు. గ్రామ పెద్దలపై నెపం మోపి సిడిపిఓ, పిడిలు చేతులు ఎత్తేస్తున్నారని వాపోతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని తనకు న్యాయం చేయాలని, ముగ్గురు పిల్లలతో కుటుంబాన్ని పోషించుకుందేందుకు సహకరించాలని అభ్యర్థిస్తోంది.

ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షులు లక్ష్మణమూర్తి :-

సమంజంలో జీవన విధానంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్న ఇంకా కుల వివక్షత కారణంగా బడుగుల జీవితాలు బుగ్గిపాలు కావడం దురదృష్టకరమని ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షులు లక్ష్మణమూర్తి పేర్కొన్నారు. ఆయా నిరీక్షణకు న్యాయం చేసేదాకా పోరాటం చేస్తామని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అంటరానితనాన్ని, కుల వివక్షతను నిర్మూలించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయా నిరీక్షణకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వీరజిన్నయ్యగారిపల్లిలో విషాదం

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి





వారం రోజుల్లో ఈననున్న ఆవులు - జీవనాధారం కోల్పోయి రోడ్డున పడ్డ రైతు కుటుంబం

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి లీకైన కరెంటే కారణమా? - విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై ఆరోపణలు

విద్యుదాఘాతమే కారణమని తేల్చిన పశుసంవర్ధక శాఖ - పరిహారం కోసం ఎదురుచూపులు

పుట్టపర్తి, సెప్టెంబర్ 20 (సీమవార్త సాయంకాలం బ్యూరో) : శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం వీరజిన్నయ్యగారిపల్లిలో విషాదం చోటుచేసుకుంది. రైతు ఈడుగుట్టి లక్ష్మీనారాయణకు చెందిన రెండు ఆవులు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. గ్రామంలో లక్ష్మీనారాయణ తన ఇంటి ఆవరణలోనే ఆవులను కట్టేసి ఉంచారు. ఆవులు కట్టేసిన చోటుకు ఆనుకునే కరెంటు స్తంభం, దానిపైనే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి లీకైన విద్యుత్ పక్కనే ఉన్న ఫెన్సింగ్‌కు వ్యాపించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఫెన్సింగ్‌ను తాకిన రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. మృతి చెందిన ఆవులు వారం రోజుల్లో ఈననున్నాయని రైతు తెలిపారు. ఆవుల పాల అమ్మకంపైనే తమ కుటుంబ జీవనం సాగుతోందని, ఇప్పుడు జీవనాధారం కోల్పోయి రోడ్డున పడ్డామని రైతు లక్ష్మీనారాయణ, ఆయన భార్య కాంతమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని బాధిత కుటుంబం ఆరోపిస్తున్నట్లు తెలిపారు. ఇంటి ఆవరణలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, సరైన నిర్వహణ చేపట్టకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న పశు సంవర్ధక శాఖ అధికారులు శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ప్రాథమిక పరిశీలనలో విద్యుదాఘాతం వల్లే ఆవులు మృతి చెందినట్లు నిర్ధారిస్తూ నివేదిక ఇచ్చినట్లు సమాచారం. అయితే బాధిత రైతుకు పరిహారం అందించడంలో పశుసంవర్ధక శాఖ, విద్యుత్ శాఖ అధికారులు చొరవ చూపాలని, ప్రభుత్వం ఆదుకొని తగిన పరిహారం అందించాలని బాధిత కుటుంబం సభ్యులు కోరుతున్నారు.

ఎల్ నినో ప్రభావాన్ని ముందే అంచనా వేసుకున్నాం..
ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు మాట్లాడుతూ, "ఎల్ నినో పరిస్థితులను మనం ముందుగానే అంచనా వేశాం. దీనికోసం సిద్ధం చేసుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలి. ఎల్ నినో ప్రభావం కేవలం రైతులపైనే కాదు, అన్ని వ్యవస్థలపైనా పడుతుంది. కాబట్టి రైతులను కాపాడుకుంటూనే, వినియోగదారులపై ధరల భారం పడకుండా చూడటం మన బాధ్యత" అని అన్నారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు వంటి నిత్యావసరాల ధరలను కచ్చితంగా అదుపులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గోదాముల్లోని బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసి, ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉల్లి కొరతను అధిగమించేందుకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉల్లి సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను వివరిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా ప్రకాశం, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 30.84 లక్షల హెక్టార్లకు గాను, ఇప్పటివరకు 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంటల బీమా మొత్తాలు వారికి అందేలా చూడాలని, డిమాండ్ ఆధారిత పంటల సాగుపై దృష్టి సారించాలని చెప్పారు. వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, హైరిస్క్ జోన్‌లోని ఉద్యాన పంటలను కాపాడేందుకు రూ.190 కోట్లు కేటాయించామని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ.60 కోట్లు సిద్ధం చేశామని, 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేశామని తెలిపారు. స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్‌లను ప్రోత్సహించి కూరగాయల ధరలను అదుపులో ఉంచవచ్చని అభిప్రాయపడ్డారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "2014-19 మధ్య మేము ఇరిగేషన్‌పై రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తే, 2019-24 మధ్య నాటి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లే ఖర్చు చేసింది. ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఎల్ నినో వంటి విపత్తు వచ్చినా ఇబ్బందులు ఉండేవి కావు. మేము అధికారంలోకి వచ్చాక రూ.3,500 కోట్లతో 100 రోజుల్లో హంద్రీ-నీవా కాలువలకు నీరందించగలిగాం" అని చంద్రబాబు గుర్తుచేశారు.

దళితుల భూముల్లో అంగుళం కూడా తీసుకోం..
ఆయన మాటలు నమ్మొద్దు

-మొదటిపేజీ తరువాయి

రక్షణ కవచంగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ఆశీస్సులతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పొంగులేటి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రధాన ప్రాధాన్యతలని అన్నారు. భూసంస్కరణలు, భూ పంపిణీ వంటి చారిత్రక నిర్ణయాలతో నిరుపేద దళితులకు భూములు ఇచ్చి హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో సుమారు 25 లక్షల ఎకరాల భూమిని దళితులకు, 2 లక్షల ఎకరాల పోడు భూములను గిరిజనులకు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేసిన 'దొర' కేసీఆర్ మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై విచారణ జరుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. ఈ ఫామ్‌హౌస్ దాదాపు 700 ఎకరాల్లో విస్తరించి ఉందని, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎర్రవల్లి గ్రామానికి చెందిన 120 మంది దళిత రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన పత్రాలతో హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొనడంతో దళితుల్లో ఆందోళన మొదలైంది.

ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రభుత్వం మీ భూమిలో అంగుళం కూడా తీసుకోదు. మీ భూములను స్వాధీనం చేసుకునే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో ఎలాంటి భయం, ఆందోళన అవసరం లేదు. ప్రజల ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని దళితులకు భరోసా ఇచ్చారు. భూ రికార్డుల పరిశీలన, సర్వే, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను భూములు లాక్కోవడంగా చూడటం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రజల భూ హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, వివాదాలను పరిష్కరించడం, వారి హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కొంతమంది శక్తిమంతమైన వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

అయోధ్య తరహా శ్రీరామ మందిరం..!!

-మొదటిపేజీ తరువాయి

సవిత తెలిపారు. అదేవిధంగా చాలకూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిను నవంబర్ నాటికి అంతా పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధి లో మోడీ విశ్వగురువు..!!



-మొదటిపేజీ తరువాయి

నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో సాగుతున్న సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా ప్రజలు బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజాకర్షణీయ పథకాలు మౌలిక వసతుల కల్పన మరియు ధార్మిక పరిరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాల ప్రజలలో నమ్మకం పెరిగిందన్నారు. ప్రతి గ్రామంలో నూ బిజెపి బలోపేతానికి కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని ప్రజలు నిత్య జీవిత సమస్యల పరిష్కారంలో పార్టీ శ్రేణులు ఎల్లప్పుడూ ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్చార్జి కూనిగిరి నీలకంఠం మాట్లాడుతూ రాబోయే రోజులలో శ్రీ సత్య సాయి జిల్లా పార్టీ మరింత విస్తరిస్తుందని యువ నాయకులు క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ప్రజలలోకి వెళ్లడం ఎంతో శుభ పరిణామమని పేర్కొన్నారు. యువ నాయకుడు పార్థసారథి రెడ్డి పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర వహిస్తున్నాడని ప్రత్యేకంగా ఆయనను అభినందించారు. పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ మాపై మరియు భారతీయ జనతా పార్టీ నాయకత్వం పై నమ్మకంతో నేడు 36 కుటుంబాలు బిజెపిలోకి చేరడం చాలా సంతోషకరమన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటూ రాబోయే రోజులలో ఈ ప్రాంతంలో పార్టీని అత్యంత బలమైన శక్తిగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమన్నారు. నూతనంగా చేరిన కుటుంబాల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రధాని మోడీ అభివృద్ధి పాలన స్థానిక యువ నాయకత్వం పై నమ్మకంతో తాము బిజెపి పార్టీలోకి చేరామని పార్టీ పురోగతికి సాయి శక్తుల కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మంజునాథ్ వేదవ్యాస్ స్థానిక నాయకులు గీత ముహూర్తాల వివిధ మూర్చాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంజక్షన్ 20 నిమిషాల్లో ఆగిన ఊపిరి..!!

ఎనుములపల్లి పీహెచ్సీలో ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి చెందాడనే ఆరోపణ

....కలెక్టర్ చొరవ తీసుకొని విచారణ జరిపించాలని కుటుంబ సభ్యుల డిమాండ్

....మృతుని కుటుంబం నిరుపేద - ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

....మృతికి గల కారణంపై పొంతనలేని సమాధానాలు ఇచ్చిన వైద్యాధికారి?

పుట్టపర్తి, సెప్టెంబర్ 20 (సీమవార్త సాయంకాలం బ్యూరో) : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న సంఘటన తీవ్ర కలకలం రేపుతోంది. పీహెచ్సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ వైష్ణవిలు చికిత్స అందించిన తర్వాతే పరిస్థితి విషమించిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నట్లు తెలిపారు. నల్లమాడ మండలం వంకరకుంట గ్రామానికి చెందిన రాము (42) భార్య నారాయణమ్మ, పిల్లలతో కలిసి వినాయక చవితి పండుగ నిమిత్తం వారం రోజుల క్రితం ఎనుములపల్లిలోని వాళ్ల అక్క నివాసానికి వచ్చారు. నిన్నటి రోజు వరకు జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో చలాకీగా పాల్గొన్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఒళ్లు నొప్పులు ఉన్నాయని ఇంట్లో ఉన్న ఐక్లోఫినాక్, డోలో-650 మాత్రలు వేసుకున్నారని, గంట తర్వాత ఒళ్లంతా అలర్జీతో దద్దుర్లు రావడంతో సుమారు ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఎనుములపల్లి పీహెచ్సీకి తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఆసుపత్రికి వచ్చిన వెంటనే వైద్యాధికారులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ వైష్ణవిలు పరీక్షించి దద్దుర్లు తగ్గడానికి అవిల్ ఇంజక్షన్, ఫిట్స్ రావడంతో డయాజిపం ఇంజక్షన్ ఇచ్చినట్లు వైద్యాధికారులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంజక్షన్ వేసిన 20 నిమిషాల్లోనే ఫిట్స్ వచ్చి పరిస్థితి విషమించి మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే మృతుడు రాము మరణానికి గల కారణాలపై పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతుడికి మద్యపాన అలవాట్లు లేవని కుటుంబ సభ్యులు స్పష్టం చేస్తుండగా, వైద్యాధికారి మాత్రం మద్యం సేవించాడని చెబుతున్నట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. ఇంటికి పెద్దదిక్కు అయిన రాము ఉన్నట్టుండి చనిపోవడంతో భార్య నారాయణమ్మ, పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, మృతుని కుటుంబం చాలా నిరుపేద కుటుంబమని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ భర్తకు జరిగినట్లుగా ఇంకెప్పుడూ ఏ వ్యక్తికి జరగకుండా వైద్యులపై చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని సమగ్ర విచారణ జరిపి మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కల్పించాలని కుటుంబ సభ్యులు కోరినట్లు తెలిపారు.

ఎర్రవల్లిలో భూముల సర్వేకు బ్రేక్..

-మొదటిపేజీ తరువాయి

325 సర్వే నంబర్‌లో భూములు ఉన్న రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎర్రవల్లి గ్రామానికి చెందిన సుమారు 100 మంది రైతులకు నోటీసులు అందగా.. తమ భూములకు సంబంధించిన ఆధారాలతో సర్వేకు హాజరు కావాలని అధికారులు ఆదేశించారు. విడతల వారీగా మరో 100 మందికి పైగా రైతులకు కూడా నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మూడు రోజులుగా హద్దుల గుర్తింపు

ఇదిలా ఉండగా.. 325 సర్వే నంబర్ పరిధిలోని భూముల హద్దులను గుర్తించే ప్రక్రియను అధికారులు గత మూడు రోజులుగా చేపట్టారు. సర్వే నంబర్ పరిధిని పరిశీలించి బౌండరీలను మార్కింగ్ చేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతుల వారీగా భూముల వివరాలను నమోదు చేయనున్నారు. మొదట 325 సర్వే నంబర్‌కు సంబంధించి ఎంజాయ్‌మెంట్ సర్వేను(ఏ రైతు ఏ భూమిని అనుభవిస్తున్నారో/సాగు చేస్తున్నారో) పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం రైతుల వారీగా భూములను గుర్తించి సబ్ డివిజన్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రేపటి నుంచి ప్రారంభమయ్యే రైతుల వారీ సర్వేలో సంబంధిత రైతులు తమ వద్ద ఉన్న భూ పత్రాలు, ఇతర ఆధారాలతో హాజరు కావాలని అధికారులు సూచించారు.

388 ఎకరాల ప్రభుత్వ భూమిపై దృష్టి..

ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ ఆధ్వర్యంలో ఈ సర్వే కొనసాగుతోంది. గజ్వేల్, హుస్నాబాద్, కలెక్టరేట్ డివిజన్లకు చెందిన సర్వే విభాగం అధికారులు, మర్కూక్ ఆర్ఐ, మండల సర్వేయర్‌తోపాటు మరో ఏడుగురు సర్వేయర్లు, నలుగురు జీపీఓలు సర్వేలో పాల్గొంటున్నారు. బృందాలుగా విడిపోయి ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని 325 సర్వే నంబర్‌లో ఉన్న 388 ఎకరాల ప్రభుత్వ భూమిపై ప్రధానంగా దృష్టి సారించారు. హద్దులు స్పష్టమవుతున్న నేపథ్యంలో రైతుల వారీగా నోటీసులు జారీ చేసి.. ఎవరి పేరుపై ఎంత భూమికి పట్టా ఉంది? ప్రస్తుతం ఎవరి సాగులో ఎంత ఉంది? క్షేత్రస్థాయిలో ఎంత భూమిని అనుభవిస్తున్నారు? వంటి వివరాలను సేకరిస్తున్నారు. రైతుల వారీగా లెక్కలు పూర్తయిన తర్వాత మొత్తం 388 ఎకరాల్లో సాగులో ఉన్న భూమి ఎంత? మిగిలిన భూమి ఎంత? అనే వివరాలను తేల్చనున్నారు.

సీమ వార్త సాయంకాలం
ఆదివారం 20 సెప్టెంబర్ 2026

ఎనుములపల్లి పీహెచ్సీలో ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి చెందాడనే ఆరోపణ

కలెక్టర్ చొరవ తీసుకొని విచారణ జరిపించాలని కుటుంబ సభ్యుల డిమాండ్

మృతుని కుటుంబం నిరుపేద – ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

మృతికి గల కారణంపై పొంతనలేని సమాధానాలు ఇచ్చిన వైద్యాధికారి?





పుట్టపర్తి, సెప్టెంబర్ 19 (సీమవార్త బ్యూరో) : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న సంఘటన తీవ్ర కలకలం రేపుతోంది. పీహెచ్సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ వైష్ణవిలు చికిత్స అందించిన తర్వాతే పరిస్థితి విషమించిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నట్లు తెలిపారు. నల్లమాడ మండలం వంకరకుంట గ్రామానికి చెందిన రాము (42) భార్య నారాయణమ్మ, పిల్లలతో కలిసి వినాయక చవితి పండుగ నిమిత్తం వారం రోజుల క్రితం ఎనుములపల్లిలోని వాళ్ల అక్క నివాసానికి వచ్చారు. నిన్నటి రోజు వరకు జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో చలాకీగా పాల్గొన్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఒళ్లు నొప్పులు ఉన్నాయని ఇంట్లో ఉన్న ఐక్లోఫినాక్, డోలో–650 మాత్రలు వేసుకున్నారని, గంట తర్వాత ఒళ్లంతా అలర్జీతో దద్దుర్లు రావడంతో ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఎనుములపల్లి పీహెచ్సీకి తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఆసుపత్రికి వచ్చిన వెంటనే వైద్యాధికారులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ వైష్ణవిలు పరీక్షించి దద్దుర్లు తగ్గడానికి అవిల్ ఇంజక్షన్, ఫిట్స్ రావడంతో డయాజిపం ఇంజక్షన్ ఇచ్చినట్లు వైద్యాధికారులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంజక్షన్ వేసిన 20 నిమిషాల్లోనే ఫిట్స్ వచ్చి పరిస్థితి విషమించి మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే మృతుడు రాము మరణానికి గల కారణాలపై పాత్రికేయులు వివరణ కోరగా వైద్యాధికారి డాక్టర్ గాయత్రి పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతుడికి మద్యపాన అలవాట్లు లేవని కుటుంబ సభ్యులు స్పష్టం చేస్తుండగా, వైద్యాధికారి మాత్రం మద్యం సేవించాడని చెబుతున్నట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. ఇంటికి పెద్దదిక్కు అయిన రాము ఉన్నట్టుండి చనిపోవడంతో భార్య నారాయణమ్మ, పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, మృతుని కుటుంబం చాలా నిరుపేద కుటుంబమని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ భర్తకు జరిగినట్లుగా ఇంకెప్పుడూ ఏ వ్యక్తికి జరగకుండా వైద్యులపై చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని సమగ్ర విచారణ జరిపి మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కల్పించాలని కుటుంబ సభ్యులు కోరినట్లు తెలిపారు.

యలమంచిలి ఎమ్మెల్యే తో కాపునాడు అధ్యక్షులు కొండా మల్లికార్జున భేటీ



తనకల్లు సెప్టెంబర్ 20 సీమ వార్త సాయంత్రం తనకల్లు మండల పరిలోని కొక్కంటి క్రాస్ కు చెందిన కాపు నాడు కదిరి నియోజకవర్గం అధ్యక్షులు కొండా మల్లి కార్జున యలమంచిలి శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్చం ఇచ్చి ఎమ్మెల్యే ని సన్మానించి ఆత్మీయంగా పలకరించడం జరిగింది.ఈ సందర్భంగా కొండా మల్లికార్జున మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాపులకు ఎక్కువ రిజర్వేషన్లు కల్పించాలని, అలాగే కాపులకు రావలసిన నిధులు గురించి శాసన సభలో మాట్లాడాలని ఎమ్మెల్యే ను కోరినట్లు ఆయన తెలియ జేశారు.

అమరాపురం ఉన్నత పాఠశాల స్థలాన్ని పరిరక్షించాలి

స్థలదాత బావాజీ లక్ష్మణ్ దాస్ పేరు పెట్టాలి

....వైకాపా నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉప్పార్లపల్లి శివన్న



అమరాపురం సెప్టెంబర్ 20 సీమవార్త అమరాపురం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలకు దాత కేటాయించిన స్థలాలను పరిరక్షించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ మడకశిర నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉప్పార్లపల్లి శివన్న డిమాండ్ చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన సుమారు 9 ఎకరాల 38 సెంట్ల భూమిని పాఠశాలల అవసరాల కోసం దానం చేసిన స్థలదాత బావాజీ లక్ష్మణ్ దాస్ సేవలను గుర్తించి, పాఠశాలకు ఆయన పేరును పెట్టాలని ఆయన కోరారు.విద్యాభివృద్ధి కోసం తన విలువైన భూమిని దానం చేసిన స్థలదాత బావాజీ లక్ష్మణ్ దాస్‌ను ప్రభుత్వం, అధికారులు, ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకునే విధంగా పాఠశాలకు ఆయన పేరు పెట్టడం సముచితమని అన్నారు. దాతల సేవలను గుర్తించడం ద్వారా భవిష్యత్ తరాలకు కూడా సేవా స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా పాఠశాలలకు కేటాయించిన భూమిపై ఎలాంటి ఆక్రమణలు జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల భవిష్యత్ అవసరాలు, విద్యార్థులకు క్రీడా మైదానాలు, అదనపు తరగతి గదులు తదితర మౌలిక వసతుల కోసం ఈ స్థలం ఎంతో అవసరమని తెలిపారు.స్థలదాత బావాజీ లక్ష్మణ్ దాస్ పేరును పాఠశాలకు పెట్టడంతో పాటు, పాఠశాలల స్థలాన్ని శాశ్వతంగా పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేశారు.

టిడిపి నాయకుడి గృహప్రవేశ వేడుకల్లో...మాజీ ఎమ్మెల్సీ



అమరాపురం సెప్టెంబర్ 20 సీమవార్త సాయంత్రం. మండల పరిధిలోని బసవనపల్లి గ్రామపంచాయతీకి చెందిన ఆరోనపల్లి గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు యజమాన్ ఈశ్వరప్ప కుమారులు మంజునాథ్ ఛాయాకుమార్, భోజేగౌడ్ లు నిర్మించిన నూతన గృహప్రవేశ వేడుకల్లో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం గృహప్రవేశ నిర్వాహకులు విచ్చేసిన ప్రముఖులకు శాలువాపూలమాలలతో ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మండల సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, టిడిపి పంచాయతీ ముఖ్య నాయకులు పరమేశ్వరప్ప, డీలర్ మోహన్, పంచాయతీ టిడిపి కన్వీనర్ చంద్ర నాయక్, దాసరి రవి, మధు, మీసేవ నిరంజన్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, వీరపసముద్రం మంజునాథ్, చెరువు సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, జగన్ వైరంతో నష్టపోతున్నది రాయలసీమే

రాయలసీమ నీటి గోసకు ఇద్దరు నేతలే కారణం: తిప్పిరెడ్డి బహిరంగ లేఖ



తాడిపత్రి, సెప్టెంబర్ 20 సీమ వార్త సాయంత్రం. కర్నూలు వైసీపీలో మంటలు – ఆధిపత్య పోరుతో టీడీపీకి లబ్ధి అనే ఒక ఛానల్ లో విశ్లేషణ పాక్షిక సత్యం మాత్రమేనని, అసలు నష్టం యావత్ రాయలసీమకే జరుగుతోందని సామాజిక కార్యకర్త తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. మీడియా మిత్రులకు ఆయన బహిరంగ లేఖ విడుదల చేశారు. ఆ లేఖలో ఆయన పేర్కొన్న ప్రధాన అంశాలు.. "మా రాయలసీమలో పుట్టిన ఇద్దరు నేతలు – చంద్రబాబు నాయుడు, జగన్ మోహన్ రెడ్డి మధ్య వైరం, ఆధిపత్య రాజకీయం వల్ల లాభపడింది మధ్య కోస్తా మాత్రమే! తుంగభద్రలో 31 టీఎంసీలు, శ్రీశైలంలో 104 టీఎంసీలు పట్టని విధంగా భారీ పూడికతో మొత్తం 135 టీఎంసీల నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. ప్రతి గుడ్ ఇయర్ లో వేల టీఎంసీల వరద నీరు రాయలసీమ రైతులకు దక్కకుండా వృథాగా సముద్రం పాలవుతోంది. కానీ ఈ ఇద్దరూ పోటీపడి తుంగభద్ర, కృష్ణా నదులపై ప్రాజెక్టులు (సమాంతర కాలువ, గుండ్రేవుల, వేదవతి, సిద్ధేశ్వరం, రాయలసీమ లిఫ్ట్) కట్టకుండా ఆపుతున్నారు. రాయలసీమలో రాజధాని లేదు, హైకోర్టు లేదు, చివరకు బెంచ్ కూడా లేదు. కానీ 2014 నుండి 5 ఏళ్లకోసారి వీరికి సీఎం కుర్చీ మాత్రం వస్తోంది. అసమర్థతకు నిదర్శనం: పైన కర్ణాటక, పక్కన తెలంగాణలో బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా, కేంద్రం దగ్గర చకచకా అనుమతులు తెచ్చుకుని తుంగభద్ర, కృష్ణాలపై ప్రాజెక్టులు కట్టుకుని వారి ప్రజలకు నీళ్లు తరలిస్తున్నారు. 2014 నుండి దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా మొత్తం ఎంపీ సీట్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా కేంద్రంలోని బీజేపీకే మద్దతు ఇస్తున్నా, ఏపీలో మాత్రం ఈ ఇద్దరు యుద్ధం చేసినట్లు యాక్షన్ చేస్తూ రాయలసీమను శాశ్వత ఎడారిగా మారుస్తున్నారు. నేను రాసిన దాంట్లో ఏమాత్రం తప్పు ఉన్నా క్షమాపణ చెప్పడానికి సిద్ధం. నిజమైతే మీ మీడియాల్లో విశ్లేషణ చేసి చూపించండి" అని లేఖలో పేర్కొన్నారు.

కర్ణాటక గడ్డపై... సెంట్రల్ సిల్క్ బోర్డు మీటింగ్.

అనంత ఎంపీ అంబికా తో పాటు పాల్గొన్న.. అభ్యుదయ సేవా సంఘం స్టేట్ కోఆర్డినేటర్ పాపన్న.





బెంగళూరు సెప్టెంబర్ 20 సీమ వార్త సాయంత్రం. బెంగళూరు మహానగరం జికేవికే నందు సెంట్రల్ సిల్క్ బోర్డు సమావేశం జరిగింది కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రి గిరిరాజు సింగ్ మంత్రి శోభ అనంతపురం ఎంపీ సెంట్రల్ సిల్క్ బోర్డు మెంబర్ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర వెల్ఫేర్ కోఆర్డినేటర్ దేవాంగం పాపన్న కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జిఎస్టి ని పూర్తిగా రద్దు చేయాలని చేనేత రుణమాఫీ చేయాలని దేవాంగం పాపన్న చిన్నప్ప పృథ్వి అభిషేక్ నాగార్జున పేర్కొన్నారు

నామకరణ వేడుకకు ఎంపీ బీకే పార్థసారథి హాజరు

రొద్దం సెప్టెంబర్ 20 సీమ వార్త సాయంత్రం రొద్దం మండలంలోని కలిపి మరువపల్లి మాజీ సర్పంచ్ గోరప్ప మనవడి నామకరణ వేడుకకు హిందూపురం పార్లమెంటు సభ్యులు బీకే పార్థసారథి, యువ నాయకుడు బీకే సాయి కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ నాయకులు, పెద్దలు, కార్యకర్తలతో ఆత్మీయంగా ముచ్చటించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జనార్దన్ గుప్తా పార్థివదేహానికి నిమ్మల కిష్టప్ప ఘన నివాళులు



గోరంట్ల సెప్టెంబర్ 20 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఆర్యవైశ్య నేత జనార్ధన్ గుప్తా ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన పార్థివ దేహానికి మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జనార్దన్ గుప్తా మృతి పట్ల నిమ్మల కిష్టప్ప తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గోరంట్ల మాజీ సర్పంచ్ నిమ్మల చంద్రశేఖర్, గోరంట్ల మండల మాజీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, పట్టణ కన్వీనర్ కక్కల రఘునాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

పంటలకు ప్రాణం పోసిన వరుణుడు

తాడిపత్రి మండలంలో భారీ వర్షం... రైతన్నకు ఊరట

తాడిపత్రి, సెప్టెంబర్ 20 సీమ వార్త సాయంత్రం: తాడిపత్రి మండల వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోసినట్లయింది. గత కొద్ది నెలలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వేరుశనగ, కంది, పత్తి పంటలు వాడిపోతుండగా, తాజాగా కురిసిన వర్షంతో రైతన్న ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరింది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విజన్ ప్లస్ ఐ క్యాంప్ ఉచిత కంటి వైద్య శిబిరం

....నల్లమాడ లో జడ్పీ పి హెచ్ హై స్కూల్లో వైద్య పరీక్షలు.



నల్లమడ సెప్టెంబర్ 20 సీమ వార్త సాయంత్రం. ఉచిత కంటి వైద్య శిబిరంలో దాదిరెడ్డి విశ్వనాథరెడ్డి, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారుపుట్టపర్తి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ మంత్రివర్యులు డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మరియు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశాలు, గోపే పల్లి దాదిరెడ్డి ఫ్యామిలీ ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నల్లమాడ నందు విజన్ ప్లస్ కదిరి ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో 70 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగినది, ఇందులో భాగంగా కంటి ఆపరేషన్లకు అర్హులు 32 మంది గా గుర్తించారు వీరికి సైదాపురం శ్రీ ఆంజనేయస్వామి సమీపంలో ఉన్న విజన్ ప్లస్ హాస్పిటల్ నందు సోమవారం కంటి ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజన్ ప్లస్ కంటి ఆసుపత్రి డాక్టర్లు, దాదిరెడ్డి విశ్వనాథరెడ్డి, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కుటాలపల్లి హెడ్మాస్టర్ చాంప్లా నాయక్, మహేష్, పటాన్ బాబావాలి, ఎస్ కేశవరెడ్డి, డి హనుమంత రెడ్డి, కదిరి విజన్ ప్లస్ కంటి ఆసుపత్రి సిబ్బంది, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

రూ.2.10 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజలి



పరిగి సెప్టెంబర్ 20 సీమ వార్త సాయంత్రం. మండలంలోని ఊటుకూరు రోడ్డు నుంచి పైదేటి మీదుగా ఎర్రగుంట, తిరుమలదేవరపల్లి గ్రామాల వరకు రూ. 2. 10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ భూమిపూజ చేశారు. ఎర్రగుంట క్రాస్ వద్ద ఆర్డీటీ ఇళ్ల సమీపంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.బీటీ రోడ్డు నిర్మాణంతో పైదేటి, ఎర్రగుంట, తిరుమలదేవరపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. రైతులు, విద్యార్థులు, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 2. 10 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి సవితమ్మ తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881